Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 145
సంచిక : 261
పేజీలు : 3

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఆదివారం, జూన్ 07, 2026



# ఈవీఎంల గోదామును తనిఖీచేసిన జిల్లా కలెక్టర్

**టీమీడియా, జూన్ 6, కురవి :** కలెక్టరేట్ దగ్గరలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎంలు), వివిప్యాట్‌లు భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ శనివారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు. గోదాములో పటిష్ఠ భద్రత నడుమ భద్రపరిచిన ఈవీఎంలు, వివిప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రి నిల్వ ఉంచిన గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, గోదాం భద్రతా వ్యవస్థలను సమీక్షించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పవన్ కుమార్, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# పరిష్కారమే ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లక్ష్యం

## జిల్లా కలెక్టర్ అంకిత్

**టి మీడియా, జూన్ 6 ,లక్ష్మీదేవి పల్లి :**ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా లక్ష్మీదేవి పల్లి మండలం కారుకొండ రామవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రామ సభకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 6వ తేదీ నుండి అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయబడుతోందని తెలిపారు. గ్రామ సభలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే సమర్థవంతమైన వేదికలని అన్నారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి విధానాలను అనుసరించాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పంటల దిగుబడులు పెరిగేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు

4లో

# పేదల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి

-భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

-మంత్రి దనసరి అనసూయ





**టీ మీడియా,జూన్6, ములుగు బ్యూరో** :గు పేదల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, అర్హులైన అందరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందిస్తున్నామని, భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తున్నామని, వడ్డీ లేని రుణాలు, ఉపాధి అవకాశాల ద్వారా మహిళలు స్వయం సమృద్ధి సాధిస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం బూర్గుపేట గ్రామంలోని ఆశ్రమ పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో బూర్గుపేట, లక్ష్మీపురం, చక్రవర్తిపల్లి, అడవి రంగాపూర్, మల్లయ్యపల్లి గ్రామాల ప్రజల నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం, భూ సమస్యల పరిష్కారం, మహిళల ఆర్థిక సాధికారత లక్ష్యంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అర్హత కలిగిన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కూడా విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

భూ భారతి కార్యక్రమంలో భాగంగా వెంకటాపూర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని తెలిపారు. రామచంద్రాపురం ప్రాంతంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సుమారు 10 వేల ఎకరాల భూములకు సంబంధించిన సర్వే ప్రక్రియ పూర్తయిందని, అర్హులైన రైతులకు త్వరలోనే పట్టాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. తిమ్మాపురం, పట్వారీపల్లె ప్రాంతాల భూ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఐటిడిఏ పరిధిలో పరిష్కరించగల సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ., సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, మండల తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

**- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**




**టీమీడియా ,జూన్ 6, ఖమ్మం:**నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టి అన్ని జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నీట్ పరీక్ష నిర్వహణ, ప్రభుత్వ పాఠశాల పున:ప్రారంభం కు యూనిఫామ్స్ తయారీ, వరి కొనుగోలు ప్రక్రియ, జూన్ 9న జరిగే మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమం, ధాన్యం కొనుగోలు పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా, ఖమ్మం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి పరీక్ష కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు తాగునీరు, బెంచీలు, బల్లలు, కుర్చీలు, మూత్రశాలల సౌకర్యం వంటి అన్ని మౌళిక సదుపాయాలను సమకూర్చాలన్నారు. పోలీస్ ఎస్కార్ట్ తో ప్రభుత్వ వాహనంలో నిర్దేశించిన రూట్ లో మాత్రమే పరీక్ష పేపర్లను పరీక్ష కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలనీ, విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రాథమిక చికిత్స కిట్ లు అందుబాటులో ఉండాలని, పరీక్ష రాసే విద్యార్థుల గదుల్లో ఎలాంటి మెటీరియల్ లేకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, ప్రతి విద్యార్థిని నిశితంగా పరిశీలించిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని పేర్కొన్నారు.

4లో

## ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన ఎం. రాజేశ్వరి



**టీమీడియా, జూన్ 6, కురవి** :మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారిణి (ఆర్డీవో)గా ఎం. రాజేశ్వరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఖమ్మం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ, బదిలీపై మహబూబాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం అధికారికంగా విధుల్లో చేరి బాధ్యతలు చేపట్టారు. జిల్లా పరిపాలనలో భాగంగా రెవెన్యూ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తానని ఎం. రాజేశ్వరి పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆక్వా రంగంలో అభివృద్ధి సాధించాలి

### రిటైర్డ్ సంచాలకులు

**టీ మీడియా, జూన్ 6 ,కూసుమంచి:** పుష్కల మంచినీటి జలవనరులు గల తెలంగాణ రాష్ట్రంలో మత్స్యకారులు రైతులు చేపల సాగు చేసి ఆక్వా రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని మత్స్య శాఖ రిటైర్డ్ అదనపు సంచాలకులు వి శ్రీనివాసరావు సూచించారు. పాలేరు మత్స్య పరిశోధన కేంద్రంలో మత్స్యకారులకు జరిగిన శిక్షణలో చివరి 3 వ రోజు శనివారం ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఆక్వా రంగం అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీ రుణాలను మత్స్యకారులు రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని శ్రీనివాసరావు కోరారు. మత్స్య శాఖ సీనియర్ సైంటిస్టు జి విద్య సాగర్ రెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణ చేపల సాగుకు ఎంతో ఉపయోగ పడుతుందని దాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఆక్వా రంగం అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. పాలేరు మత్స్య పరిశోధన కేంద్రం సీనియర్ సైంటిస్టు, అజిపతి డాక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ తాము ఇప్పటికే కేంద్రం ద్వారా 4 వేల మందికి శిక్షణ ఇచ్చామని, శిక్షణలో నేర్చుకున్న విషయాలను సహచరులకు బంధు మిత్రులకు తెలియపరిచి ఆక్వా రంగ మరింత అభివృద్ధికి మత్స్యకారులు రైతులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ శిక్షణలో అదిలాబాద్ పెద్దపల్లి ములుగు మహబూబాబాద్ నల్గొండ సూర్యాపేట వరంగల్ భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం జిల్లాల నుంచి మొత్తం 25 మంది శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణ అనంతరం ప్రశంస పత్రాలు వలలు సీసం బెండులు అందజేశారు ఈ కార్యక్రమంలో మత్స్య శాస్త్రవేత్తలు బి రవీందర్ జి గణేష్ ప్రొఫెషనల్ కుమారి బానోతు దివ్య తదితరులు పాల్గొన్నారు.






## భూ దందాలకు కొమ్ము కాస్తున్న అధికారులు..

**-సిపిఐ ఎంఎల్ మాస్ లైన్**

**టీ మీడియా, జూన్ 6,దమ్మపేట** :భద్రాద్రి కొత్తగూడెం జిల్లాదమ్మపేట మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ భూమిని గతంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి నేడు రియల్ ఎస్టేట్ అనే రూపంలో మసిపూసి మారేడు కాయ చేసి సంబంధిత క్రింది స్థాయి అధికారులను ఆధీనంలో తీసుకొని అసలుకు నకిలీకు తేడా లేకుండా రూపు మార్పు చేసి వ్యవసాయ భూమి అనే క్షేత్రాన్ని రియల్ ఎస్టేట్ గా చిత్రీకరించి స్థానిక కొందరు దళారులు ప్లాట్లు పేరుతో అమ్మకాలను నిర్వహించారని సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు పండూరి వీరబాబు శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అసలు విషయం ఏమిటంటే వ్యవసాయ భూమి యొక్క సర్వే నెంబర్లను మార్పు చేయించి,గజాల వారీగా స్థలాన్ని కేటాయించి రియల్ ఎస్టేట్ పేరు మీద వ్యాపారం సాగిస్తున్న భూ బకాసురుల నిజస్వరూపం త్వరలో అన్ని ఆధారాలతో బయటపెడతానని, మోసపోయిన స్థల వినియోగదారులకు పార్టీ పరంగా పోరాటం చేసిన్యాయం చేకూరుస్తానని ఆయన హెచ్చరించారు.

## రైతులను విస్మరిస్తున్న మోడీ ప్రభుత్వం

**పెంచిన ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలి : ఏఐయూకేఎస్**

**టీ మీడియా,జూన్06,సింగరేణి,(కారేపల్లి):**రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్)ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు శుక్రవారం సింగరేణి మండల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐయూకేఎస్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి గుగులోతు తేజ నాయక్ మాట్లాడుతూ, 2026 వ్యవసాయ సీజన్ ప్రారంభంలో ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు.వ్యవసాయానికి విత్తనాలే ప్రాణమని, రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను పూర్తిస్థాయి సబ్సిడీపై అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్రంలో 7.46 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమవుతుండగా, కేవలం 1.62 లక్షల క్వింటాళ్లను మాత్రమే సబ్సిడీపై సరఫరా చేయడం సరిపోదన్నారు.హైబ్రిడ్ జొన్న, మొక్కజొన్న,చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు,సెనగ,వేరుశెనగ,నువ్వులు,మినుములు, కందులు తదితర పంటల విత్తనాలను రైతులకు పూర్తి స్థాయిలో సబ్సిడీపై అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంతాల్లో 90 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించాలనే నిబంధనలు ఉన్నప్పటికీ,కారేపల్లి,కామేపల్లి మండలాల రైతులకు తగినంత విత్తనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించి రైతులకు భారం తగ్గించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐయూకేఎస్ ఖమ్మం డివిజన్ కమిటీ సభ్యులు పుల్లకాని సత్తిరెడ్డి,జిల్లా కమిటీ సభ్యుడు వడ్డే వెంకటేశ్వర్లు,మండల కమిటీ సభ్యుడు బి. బాలు నాయక్, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం డివిజన్ కమిటీ సభ్యుడు రావుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





## స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ

**-విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం**

**టీ మీడియా, జూన్6, ములుగు బ్యూరో** :ములుగు జిల్లా పరిధిలోని కాపేడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు శనివారం ఘనంగా సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ , గిరిజన ప్రాంతాల విద్యార్థులు, యువతలో కంప్యూటర్ పరిజ్ఞానం , డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో కాపేడు సంస్థ ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.ఈ సందర్భంగా కంప్యూటర్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన సుమారు 40 మంది విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు . కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంతోష్ హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కాపేడు డైరెక్టర్ బ్రదర్ లూర్దు రాజు విద్యార్థులను అభినందించి వారి భవిష్యత్ విజయాలకు శుభాకాంక్షలు తెలిపారు..ఈ కార్యక్రమంలో కాపేడు కో–ఆర్డినేటర్లు హనుమంతు , శ్రీ కామేష్ పాల్గొన్నారు. సంస్థ సిబ్బంది ఉషా, రామదేవి, పద్మ, ఇందిర, స్వరూప, సుజల, భాస్కర్, నరేష్, ప్రశాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో భరోసా టీం అవగాహన

**టిమీడియా, జూన్ 6, కురవి :** ప్రజాపాలన––ప్రగతి ప్రణాళికలో భాగంగా మహబూబాబాద్ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అనంతారం రాంసింగ్ తండా, ప్రతిభ కోచింగ్ అకాడమీలో భరోసా టీం ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరిష్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో భరోసా టీం సభ్యులు ప్రజలకు వివిధ సామాజిక, న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. నేటి సమాజంలో నేరాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ కీలక పాత్ర పోషించాలని, అప్రమత్తంగా ఉంటే అనేక నేరాలను ముందుగానే అరికట్టవచ్చని సూచించారు. పిల్లల పెంపకంలో లింగ వివక్షకు తావు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, బాల్య వివాహాల నిర్మూలనకు సమాజం సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, మహిళలపై హింస, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలు, మాదకద్రవ్యాల వినియోగం వంటి అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భరోసా ఇంచార్జి ఎస్ఐ వి. దీపిక, కోఆర్డినేటర్, కౌన్సిలర్ సి. హెచ్. జ్యోష్ణ, లీగల్ సపోర్ట్ పర్సన్ ఎస్. శ్వేత, సపోర్ట్ పర్సన్స్ కె. బేబీ, పి. రేణుక, ఏఎన్ఎం ఎం. పార్వతి, డీఈఓ, అకౌంటెంట్ బి. రేణుక, రిసెప్షనిస్ట్ కె. మౌనికతో పాటు పలువురు పాల్గొన్నారు.





## ట్రైనింగ్ సెంటర్ ని సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి..

**టీ.మీడియా,జూన్6,చింతూరు**: చింతూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చింతూరు, కూనవరం, వి ఆర్ పురం మండలాలకు చెందిన 216 మంది 1,2 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ఎఫ్ ఎల్ ఎన్ ట్రైనింగ్ (ఫౌండేషనల్ లీటరసీ అండ్ నుమట?రేసీటు ) .09 వరకు ఉ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు., శనివారం పోలవరం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామమూర్తి ఆకస్మికంగా సందర్శించారు.శిక్షణ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు, ఉపాధ్యాయులకు అందిస్తున్న సౌకర్యాల గురించి అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు, ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాల స్థాయిలో ఇక్కడ నేర్చుకున్న విషయాలను అమలు చేసి ఒకటి రెండు తరగతుల విద్యార్థులందరికీ చదవడం రాయడం , గణితంలో చతుర్విధ ప్రక్రియలు వచ్చే విధంగా కృత్యాధార బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఈవో తో పాటు కోర్స్ డైరెక్టర్ జి వెంకటేశ్వర్లు, సి ఎం ఓ చిన్న బాబు దొర, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పెంటమ్మ, తులసిపాక ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదియ,డిఆర్పీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం వార్తలు

**-పోరాటమే మా ముఖ్య ఉద్దేశం**

**-చైర్మన్ షేక్ దస్తగీర్..**

**టీ మీడియా, జూన్ 6,దమ్మపేట:**ప్రజా సమస్యలు పరిష్కార దిశగా ప్రతి ఒక్క ప్రజా ప్రెస్ క్లబ్ పాత్రికేయుడు వార్తలను సంధించాలని ప్రజా ప్రెస్ క్లబ్ చైర్మన్ షేక్ దస్తగీర్ అన్నారు మండల కేంద్రంలోని ప్రజా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా క్లబ్ నియమ నిబంధనలపై చర్చను జరిపారు అనంతరం క్లబ్ చైర్మన్ షేక్ దస్తగీర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండే పాత్రికేయులు ప్రజా సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని అన్నారు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత కూడా పాత్రికేయులుపై ఉందని అన్నారు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు స్థానిక సమస్యలపై దృష్టి సారించి ప్రజల మెప్పు పొందాలని ఆయన క్లబ్ సభ్యులకు సూచించారు ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ నడ్డి సాయికుమార్, వైస్ చైర్మన్ మేకల ఉపేంద్ర, కోశాధికారి నీలం రాజేశ్వరి, ప్రచార కార్యదర్శి ఎండి సాలార్, క్లబ్ సభ్యులు బొబ్బిలి రాకేష్, చాడే శ్రీనివాసరావు, ఆనంద్, షేక్ ఖాసీం, పండూరి కిరణ్, సిలారపు సతీష్ కుమార్, బొబ్బిలి శివాజీ, పరిటాల రాము, అన్నవరపు నాగేంద్రరావు, తాళ్ల సాయి కృష్ణ,లు ఉన్నారు.





## ప్రభుత్వ పాఠశాలలో చేరాలి

- ఉపాధ్యాయుల బడిబాట

**టీ మీడియా ,జూన్ 6, కామేపల్లి:** ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని మండలంలోని కొమ్మినేపల్లి హై స్కూల్ ఉపాధ్యాయులు జి వెంకటేశ్వర్లు కోరారు. శనివారం కొమ్మినేపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం బోధన జరుగుతుందని శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తారని తెలిపారు.పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు, బ్యాగులు లాంటి 24 రకాల వస్తువులు ఉచితంగా అందజేయడం జరుగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినం చేసుకొని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం విజయ కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### పరిష్కారమే ప్రజా పాలన -

సూచించారు.గ్రామాల్లో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు ప్రతి కుటుంబం అలవరుచుకోవాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్ను సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను జాబితా నుండి తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, రైతులు, గ్రామస్తులు పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, గ్రామంలోని విద్యుత్ అదనపు లైన్లు , అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి కి ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వెంటనే చర్యలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ , మాలోత్ భారతి, ఎంపీడీఓ, జి.సుస్మిత మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

ఎక్కడా కూడా తప్పులు దొర్లకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. జూన్ 9వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లాల్లోని అన్ని బస్సులు ఆయా మండలాల నుంచి మహిళా సంఘాల సభ్యులను తీసుకొని సాయంత్రం 4 గంటల లోపల హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ కి చేరుకునే విధంగా చూడాలని సూచించారు. మహిళలకు మార్గమధ్యలో భోజనాలు, తాగు నీరు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ప్రణాళికలు చేసుకోవాలన్నారు.ఈ సమావేశంలో డిఈఓ చైతన్యజైనీ, డిఎంహెచ్ఓ రామారావు, ఆర్టీసీ డీఎం, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సంతకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం చెల్లించాలి

-కాంట్రాక్టర్ భూక్య వీరన్న

**టీ మీడియా ,జూన్ 6, కామేపల్లి:** బక్రీదు పండుగ కంటే నెలరోజుల ముందు నుండి పండితాపురం పశువుల సంతలో కామేపల్లి ఎస్సై మౌఖిక ఆదేశాల మేరకు సంతలో పోలీసులు స్వయంగా దగ్గర ఉండి పశువుల అమ్మకాలు కొనుగోలు జరగనివ్వలేదు. వారు గోవులను అమ్మకాలు కొనుగోలు జరిగినట్లయితే కేసులు పెడతామని బెదిరించడంతో వ్యాపారస్తులు రైతులు సంతకు రాకపోవడం వలన గోవుల తో పాటు ఎడ్లు బర్రెలు దూడలు కూడా కేసులు పెడతారేమోనని భయం చేత ఎవరు కూడా సంతకు తీసుకొని రాలేదని, దీనివలన నిరుద్యోగులమైన నాతోపాటు సంతను తీసుకున్న గిరిజనలు గిరిజ నేతరులు తీవ్రంగా నష్టపోవడం జరిగింది. సంతను బహిరంగ వేలం నిర్వహించేటప్పుడు బక్రీదుకు పశువుల అమ్మకాలు కొనుగోళ్లపై అధికారులు ఎలాంటి ప్రకటన చేయలేదని, అనూహ్యంగా ఇప్పటికిప్పుడు అలా చేయడం వలన నాలుగు వారాలపాటు పశువులు అమ్మకాలు కొనుగోలు జరగకుండా ఉండటం వలన నష్టం జరిగిందని ఈ విషయాన్ని అధికారులు, గ్రామపంచాయతీ వారు సహృదయంతో ఆలోచించి నష్టాన్ని పూడ్చగలరని సంత కాంట్రాక్టర్ భూక్య వీరన్న సంబంధిత అధికారులు జిల్లా కలెక్టర్, డిపిఓ, పశు సంవర్ధక శాఖ జెడి, ఎండిఓ , కొమ్మినేపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్, గ్రామపంచాయతీ సెక్రటరీ తదితర అధికారులకు విన్నవించడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా జిల్లాలోని అక్రమ రవాణా జరుగుతున్న పశువులను తీసుకొచ్చి సంత ఆవరణలో కట్టి వేయడం వలన ఇంకా వ్యాపారస్తులు రైతులు ఆందోళన చెందుతూ అమ్మకాలు, కొనుగోళ్లు జరిగితే మా పశువుల్ని కూడా కట్టివేస్తారని భయం చేత ఎవరూ రావడం లేదని వీరన్న తెలిపారు. దయచేసి ఆ



పశువులను కూడా ఎక్కడికైనా మార్పించవలసిందిగా ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బాదావత్ నాగరాజు పాటిబండ్ల ప్రసాదు, మేకల మల్లికార్జునరావు, డేరంగుల తిరపయ్య, ధరావత్ హరిచంద్ర, గుగులోతు రవి, మొగిలి శ్రీను, ఎస్.కె రబ్బానీ పాషా, చల్ల మల్లయ్య, తురక బిక్షం, రాములు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన

**టిమీడియా, జూన్ 6, కురవి :** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షీ టీం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని రెండు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, జన్ను యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, విద్యార్థినులకు లింగ సమానత్వం, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మహిళా చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం అధికారులు సమాజంలో ప్రతి వ్యక్తిని గౌరవంగా చూడాల్సిన అవసరాన్ని వివరించారు. సమ్మతి (కాన్సెంట్) యొక్క చట్టపరమైన ప్రాముఖ్యతను తెలియజేస్తూ, అనుమతి లేకుండా చేసే ఏ చర్య అయినా నేరంగా పరిగణించబడుతుందని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం వంటి అంశాలపై విద్యార్థులను అప్రమత్తం చేశారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే లైంగిక వేధింపులు, స్ట్రీట్ హరాస్మెంట్, వెంటపడడం వంటి ఘటనలు ఎదురైతే వెంటనే షీ టీం హెల్ప్‌లైన్ నంబర్ 8712656935కు సమాచారం అందించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్‌కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. ఈ




కార్యక్రమంలో షీ టీం ఎస్ఐ సుధాకర్‌తో పాటు సిబ్బంది అరుణ, పార్వతి, ప్రియాంక, హైమావతి పాల్గొన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఎస్.ఐ.ఆర్.నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**టిమీడియా ,జూన్ 6, మధిర :** ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసే ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని సరైన ఓటరు జాబితా బలమైన ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.శనివారం మధిర నియోజకవర్గం లో జిల్లా కలెక్టర్ పర్యటించారు. మధిర మండలంలోని జాలిముడి గ్రామంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తో కలిసి కలెక్టర్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతంగా చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని, ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పని తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా



వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకత తో పని చేయాలన్నారు. ఎస్ఐఆర్ లో భాగమైన మండలాలు, కార్పొరేషన్, మున్సిపాలిటీ సంబంధించి ప్రతి ఓటర్లను మ్యాపింగ్ చేసే విధంగా టార్గెట్ పెట్టుకొని వంద శాతానికి చేరుకోవాలన్నారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రధాన లక్ష్యం, ఎన్నికల సిబ్బంది విధులు, పౌరుల భాగస్వామ్యం, ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, తొలగింపులు వంటి అంశాలపై అవగాహన పెంచడం ద్వారా ప్రతి అర్హ పౌరుడు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావడానికి సహకరించాలని అధికారులు కృషి చేయాలన్నారు.బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారంల పంపిణీ, సేకరణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చి, అనర్హులైన ఓటర్ల వివరాలను తొలగించే ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.ప్రతి బీఎల్ఓకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధి విధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ రాంబాబు, అన్సరీ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.